కలికి లక్ష్మీని కూర్చి ఉయ్యాలో..

- ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు
- ఉత్సాహంగా ఆడిపాడిన ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు, యువతులు

మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం వేడుకల్లో పాల్గొని బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేసి మహిళలతో కలిసి ఆడిపాడారు. మక్తల్‌లో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మహిళలతోపాటు బతుకమ్మ ఆడారు. అనంతరం బతుకమ్మలను సమీప చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. మహబూబ్‌నగర్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్రలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితోపాటు పలు చోట్ల ప్రజాప్రతినిధులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.

– నమస్తే నెట్‌వర్క్, అక్టోబర్ 10

మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని కృష్ణానగర్‌లో బతుకమ్మ వద్ద స్థానిక మహిళలు, చిన్నారులు

దేవరకద్రలో బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే జీఎమ్మార్

మహబూబ్‌నగర్‌లో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న మహిళలు

బతుకమ్మల వద్ద మహబూబ్‌నగర్ విద్యాశాఖ మహిళా ఉద్యోగులు

జానంపేటలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎమ్మార్ సతీమణి కవిత

బతుకమ్మతో చిన్నారి

కౌకుంట్లలో బతుకమ్మ వేడుకల్లో మహిళలు

సింగారంలో బతుకమ్మలతో మహిళలు, చిన్నారులు

దాయపంతులపల్లిలో బతుకమ్మలతో మహిళలు, గ్రామస్తులు

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

నివాళులర్పిస్తున్న నిరంజన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మూసాపేట(అడ్డాకుల), అక్టోబర్ 10: అడ్డాకుల గ్రామానికి చెందిన రైతుబంధు సంఘం మాజీ మండలాధ్యక్షుడు బొక్క లపల్లి తిరుపతిరెడ్డి మాతృమూర్తి పెంటమ్మ ఇటీవల మృతిచెందారు. గురువారం నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై పెంటమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారివెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రతన్ టాటా మృతి బాధాకరం

- మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

రతన్‌టాటాతో కలిసి ఉన్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి (ఫైల్)

జడ్చర్ల, అక్టోబర్ 10 : టాటాగ్రూప్ వ్యవస్థాపకుడు, ప్రముఖ వ్యాపారవేత్త రతన్ టాటా మరణం బాధాకరమని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి గురువారం ప్రకటనలో సంతాపం తెలిపారు. దేశం ఓ గొప్ప దార్శనికుడిని కోల్పోయిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

- జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్
- ఎస్పీ కార్యాలయంలో ఆయుధ, వాహన పూజలు

ఆయుధ పూజలో పాల్గొన్న డీఐజీ ఎల్ఎస్. చౌహాన్, ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 10: పోలీసు వ్యవస్థలోని ప్రతిఒక్కరూ ఆయుధాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుతంగా తమ విధులను నిర్వర్తించాలని జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ పేర్కొన్నారు. దుర్గాష్టమి సందర్భంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఆయుధ, వాహన పూజా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఎస్పీతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. దసరా పండుగ సందర్భంగా ఆయుధ పూజకు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. సిబ్బంది అందరూ స్ఫూర్తివంతంగా ఉద్దేశించి సమాజంలో శాంతి, భద్రతలను కాపాడడంలో తమ పాత్ర ఎంత ముఖ్యమైందో వివరించారు. పోలీసు వ్యవస్థలో ఇది సంప్రదాయమై, ప్రతి సంవత్సరం దసరా పండుగ సమయంలో ఇది జరుగుతూ ఉంటుందని వివరించారు. అనంతరం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు, పోలీసు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు, ఏఆర్ ఎఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ అప్పయ్య, రూరల్ ఎస్సై గాంధీ, ఏఆర్ అడ్మిన్ కృష్ణయ్య, ఆర్ఐ ఎంటీవో నగేశ్, ఆర్ఐ డీటీసీ రమేశ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో ఎంపీ పూజలు


ఫతేపూర్ మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ డీకే అరుణ

నవాబ్‌పేట, అక్టోబర్ 10: మండలంలోని ఫతేపూర్ మైసమ్మ ఆలయంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మొదటిసారి ఆలయానికి రావడంతో అధికారులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఫతేపూర్ మైసమ్మ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండలాధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పట్టించుకోవాలి

హన్వాడ, అక్టోబర్ 10: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేదని ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని గుడ్డిమల్కాపూరం, హన్వాడలో నిర్వహించిన సమావేశంలో ఎంపీ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ, రైతుభరోసా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండలాధ్యక్షుడు వెంకటయ్య, సింగిల్ విండో వైస్ కృష్ణయ్య గౌడ్‌నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.22.94కోట్ల అభివృద్ధి పనులు మంజూరు

గీతకార్మికులకు రక్షణ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, అక్టోబర్ 10: జడ్చర్ల మున్సిపాలిటీలోని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి రూ.22.94కోట్ల నిధులు మంజూరైనట్లు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఈ నిధులు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎక్కడ నీళ్లు నిల్వకుండా, ఇండ్లలోకి వెళ్లకుండా డ్రైనేజీలు నిర్మిస్తామని వివరించారు. పట్టణాభివృద్ధికి నిధులను మంజూరు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిల్లా బీసీ, వెల్ఫేర్, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలను(కిట్లు)ను అందించారు. అలాగే ప్రజలకు మంచినీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు. క్యాంప్ కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో బీసీ సంక్షేమ శాఖాధికారి ఇందిర, ఎక్సైజ్ ఎస్సై నాగరాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేందర్ గౌడ్, మిషన్ భగీరథ ఈఈ వెంకటయ్య, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనానికి స్థల పరిశీలన

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), అక్టోబర్ 10 : దేవరకద్ర నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను మంజూరు చేసింది. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చిన్న చింతకుంట మండలం దమగ్నాపూర్ శివారులో పాఠశాల భవనాన్ని నిర్మించేందుకు స్థలాన్ని కేటాయించారు. శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. దీంతో గురువారం కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి భవన నిర్మాణ స్థలాన్ని, ఏర్పాట్లను పరిశీలించారు.

పెద్దాయపల్లిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

బాలానగర్, అక్టోబర్ 10 : మండలంలోని పెద్దాయపల్లిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ విజయేందిరబోయి తెలిపారు. గురువారం రాత్రి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి ఆమె పెద్దాయపల్లి గ్రామాన్ని పరిశీలించారు. శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

భూత్పూర్, అక్టోబర్ 10: పట్టణంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ, అన్న దాత, శ్రీనివాస ట్రేడర్స్‌లో స్టాక్, రికార్డులను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా దుకాణాల్లో సక్రమంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నారాయణపేట, అక్టోబర్ 10 : పట్టణంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. ఏఎస్సై ఆంజనేయులు కథనం ప్రకారం.. కర్నాటక రాష్ట్రం మద్కల్‌కు చెందిన భీమప్ప పట్టణంలోని గోపాల్‌పేట్ వీధిలోని రేకుల షెడ్డులో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచాడు. విషయం తెలుసుకున్న పోలీసులు దాడులు నిర్వహించి 7.73 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. డీటీ కాలప్ప పంచనామా అనంతరం భీమప్పపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

లారీని ఢీకొట్టిన బొలెరో

- ఏడుగురికి గాయాలు

జడ్చర్ల, అక్టోబర్ 10 : భూత్పూర్ మండలం అమిస్తాపూర్‌కు చెందిన కూలీలు జడ్చర్ల మండలం గంగాపూర్‌లో పత్తి తీయడానికి కూలీ పనులకు వచ్చారు. సాయంత్రం తిరిగి అమిస్తాపూర్‌కు బొలెరో వాహనంలో వెళ్తున్నారు. ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టడంతో బొలెరోలోని లింగమ్మ, శ్రీనివాస్, శిరీష, లక్ష్మమ్మ, కొండమ్మ, ఫరీదా బేగం, వెంకటేశ్ గాయపడ్డారు. వీరిని జడ్చర్ల ప్రభుత్వ ఏరియా దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు.

కారు, మోటర్‌సైకిల్ ఢీ..

జడ్చర్ల మండలంలోని బూరెడ్డిపల్లి స్టేజీ వద్ద 44వ జాతీయ రహదారిపై కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం రాజాపూర్‌కు చెందిన విజయ, కృష్ణయ్య గాయపడ్డారు.

లారీ ఢీకొని 70 గొర్రెలు మృతి

దేవరకద్ర, అక్టోబర్ 10 : మండలంలోని పెద్ద గోప్లాపూర్ సమీపంలో ఆంతర్రాష్ట్ర రాహదారిపై గురువారం రాత్రి లారీ ఢీకొని 70 గొర్రెలు మృతి చెందిన ఘటన చోటు చేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం.. మక్తల్ మండలం ముష్టిపల్లికి చెందిన వెంకటయ్య, పోలయ్య జడ్చర్ల మండలం నుంచి గొర్రెలను తోలుకొని వెళ్తుండగా, దేవరకద్ర మండలం పెద్ద గోప్లాపూర్ సమీపంలో మహబూబ్‌నగర్ నుంచి రాయచూర్ వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే 70 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. డ్రైవర్ లారీ వదిలి పారిపోయి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. రోడ్డుపై గొర్రెల మృతదేహాలు చెల్లాచెదురుగా పడడంతో పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

లారీ ఢీ కొనడంతో మృతి చెందిన గొర్లు

'విదేశీ విద్య-అవకాశాల'పై నేడు సెమినార్

- 25 విదేశీ యూనివర్సిటీల ప్రతినిధుల రాక
- జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్.రవికుమార్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం, రవికుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 10: విదేశీ విద్య అవకాశాలు, సద్వినియోగంపై ఈనెల 11న పాలమూరులో 'విదేశీ విద్య సెమినార్' నిర్వహించనున్నట్లు జయప్రకాశ్ నారాయణ్ కళాశాల చైర్మన్ కేఎస్.రవికుమార్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వన్ విండో, జేపీఎన్‌సీఈ సంయుక్తంగా ఇంటర్నేషనల్ స్టడీస్‌కు సంబంధించిన సెమినార్‌ను శుక్రవారం ఉదయం జిల్లాకేంద్రంలోని సుదర్శన్ పంక్షన్ హాల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సెమినార్‌కు అమెరికా, కెనడా ఆస్ట్రేలియా, యూకే తదితర విదేశాల్లోని ప్రతిష్టాత్మకమైన 25 విశ్వవిద్యాలయాల ప్రతినిధులు, లోన్ అసిస్టెంట్ ఆఫీసర్స్, ఈటీఎస్ ప్రతినిధులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. సదస్సుకు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులకు విదేశీ యూనివర్సిటీల్లో విదేశీ విద్య, భవిష్యత్ వీసా, ఆర్థిక సమస్యలను అధిగమించేందుకు అవసరమైన సలహాలు అందిస్తారన్నారు. సదస్సుకు హాజరైన ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు అందించే సమాచారంతో సుమారు రూ.లక్షకుపైగా ఆదా అయినట్లే అని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ.. విదేశీ విద్యా సదస్సు పాలమూరులో నిర్వహించడం గొప్ప ఆలోచన అన్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, జేపీఎన్‌సీఈ కళాశాల ప్రిన్సిపాల్ సుజీవన్‌కుమార్, వన్ విండో సంస్థ ప్రతినిధి వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతిమనిషి 40నిమిషాలు నడవాలి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 10: ప్రస్తుతం జీవనశైలిలో ప్రతిమనిషి రోజు 45నిమిషాలు నడిస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తవని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

వాక్‌తన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్, మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వాక్‌తాన్ నడక కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచి ఆరోగ్యం కోసం మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం ముఖ్యమని, మహిళలు ఆరోగ్యం మీద శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం నడకను అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కె. జె రెడ్డి మాట్లాడుతూ.. మెకాళ్లు, కీళ్ల నొప్పులు వచ్చిన వారు వారంలో 5నుంచి 4రోజులు తప్పకుండా వాకింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ విద్యాసంస్థల ఎండీ డా. కృష్ణారెడ్డి, ఎస్వీఎస్ రెసిడెంట్ డైరెక్టర్ రామిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

పాలమూరు, అక్టోబర్10: రాజకీయాలకతీతంగా ఈసారి దసరా ఉత్సవాలు జరుపుకొందామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన దసరా ఉత్సవ కమిటీ సమావేశానికి హాజరై మాట్లాడారు. బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించేందుకు సహకరించాలనిలన్నారు. అలాగే బేడ బుడగ జంగం కమ్యూనిటీ హక్కుల సాధనకు కృషి చేస్తానని హామీచ్చారు.

కేంద్రం పథకాలు అందరికీ అందాలి

మాగనూరు, అక్టోబర్10 : కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని నేషనల్ లెవెల్ టీం సిబ్బంది ప్రవీణ్‌పాటిల్ పేర్కొన్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన నిధుల వివరాల సేకరణలో భాగంగా గురువారం మండలంలోని అమ్మపల్లి, కోల్పూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా అమ్మపల్లిలో కేంద్రం నిధుల ద్వారా వేసిన సీసీరోడ్లు, వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కేంద్రం పథకాల అమలు తీరుపై ఆరాతీశారు. ఉపాధి హామీ, సెంట్రల్ పింఛన్, మహిళా సంఘాల రుణాలు, ప్రధాన మంత్రి సడక్ యోజన వివరాలు సేకరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఇంకా ఏమైనా అవసరముందా అని ఏపీఎం వనితాకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం నిధుల దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు. అనంతరం మహిళా సంఘాలు, ఈజీఎస్ రికార్డులు, నర్సరీ, సీసీరోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యుడు మధుసూదన్ దేశ్‌పాండే, ఎంపీడీవో రహ్మతుద్దీన్, ఎంపీవో విజయలక్ష్మి, ఏపీవో హర్షవర్ధన్, సీసీ గంగాధర్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, మహిళా సంఘాల సభ్యులు, పింఛనుదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమ్మపల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

క్రీడాకారులకు సన్మానం

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 10: 10వ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలో పతకాలు సాధించిన క్రీడాకారులను గురువారం జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో అథ్లెటిక్స్ సంఘం నాయకులు సన్మానించారు. ఈనెల 7, 8 తేదీలో వరంగల్ జిల్లాలో జరిగిన అండర్ 14,16, 18,20 విభాగాల్లోని బాల, బాలికలు రెండు బంగారు, ఐదు కాంస్య పతకాలు సాధించారు. క్రీడాకారులను అథ్లెటిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర, కార్యదర్శి కురుమూర్తి, సురేశ్‌చందర్ మెడల్స్ అందించి శాలువాతో సన్మానించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కోచ్ సాధిక్, సునీల్, సంఘం నాయకులు శ్రీనివాస్, రాజు, శ్రీనివాసులు, ధర్మేందర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న అథ్లెటిక్స్ సంఘం సభ్యులు

మానసికంగా ధృఢంగా ఉండాలి

నారాయణపేట, అక్టోబర్ 3 : మానసిక ఆరోగ్యం మానవాళికి ఎంతో ముఖ్యమని, ధృఢ సంకల్పంతో ముందుకు సాగాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ అన్నారు. గురువారం మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతిగా సెల్‌ఫోన్ వాడడం వల్ల చిన్నారులకు మానసిక సమస్యలు ఏర్పడ తాయన్నారు.

రాతి గుట్ట కబ్జాకు యత్నం

- జడ్చర్ల మాజీ కాంట్రాక్టర్ ప్రకాశ్‌రావు

వివరాలు వెల్లడిస్తున్న ప్రకాశ్ రావు

జడ్చర్ల, అక్టోబర్ 10 : కబ్జాదారులు ఏ ఒక్క స్థలాన్ని విడిచిపెట్టడం లేదని, చివరకు రాతిగుట్లను సైతం కబ్జాకు యత్నించారని మాజీ కాంట్రాక్టర్ పి. ప్రకాశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సోమా జూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కొండ ప్రాంతంగా ఉన్న మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని సర్వే నం. 278లో సుమారు 7 ఎకరాల 9గుంటల ప్రభుత్వానికి సంబంధించిన రాతి గుట్ట (చౌడమ్మగుట్ట) ఉందని, 2009లో కొందరు వ్యక్తులు వచ్చి ఈ స్థలానికి తామే యజమానులమంటూ ఫేక్ డ్యాకు మెంట్లతో ముందుకు వచ్చారని తెలిపారు. దీనిని రక్షించాలన్న ఉద్దేశ్యంతో తాను వారి ప్రయత్నాన్ని అడ్డుకున్నానని తెలిపారు. జిల్లా రెవెన్యూ, సర్వే, సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డ్స్ అధికారులు సైతం సర్వే నిర్వహించి ఈ గుట్ట ప్రాంతం పూర్తిగా ప్రభుత్వానిదేనని తేల్చారన్నారు. గుట్టను కాపాడాలన్న ఉద్దేశ్యంతో తాను హైకోర్టులో పిటీషన్ వేశానని, అధికారుల సర్వేను పరిగణంలోకి తీసుకున్న హైకోర్టు ఈ ఏడాది జూన్ 25న కబ్జాదారులు తమ పిటీషన్‌ను సవాల్ చేస్తూ దొంగ పత్రాలతో వేసిన కేసును సైతం కొట్టివేశారన్నారు. దీంతో వారు సుప్రిం కోర్టుకు వెళ్లినా ఆ కేసును సైతం కొట్టివేశారని తెలిపారు. సుమారు 15 సంవత్సరాలుగా ఈ గుట్టను కాపాడేందుకు తాను సొంత డబ్బు, ఆస్తులను తాకట్టు పెట్టి న్యాయ పోరాటం చేశానన్నారు. హైకోర్టు, సుప్రిం కోర్టులో న్యాయం పక్షాన ఇచ్చిన తీర్పును తాను గౌరవిస్తున్నానని తెలిపారు. అలాగే ప్రభుత్వం కూడా స్పందించి ఈ గుట్టను కాపాడుకునే ప్రయత్నం చేయాలని, కాని అలా చేయడం లేదన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం ఈ భూమిని కాపాడుకోవాలని, లేని పక్షంలో తాను ఇదే స్థలంలో జీవనసమాధికి వెనుకాడనని స్పష్టం చేశారు.

చెట్టును ఢీకొన్న కారు దగ్ధం

- ప్రాణాలతో బయటపడిన ఆరుగురు

మాగనూరు, అక్టోబర్ 10 : చెట్టును ఢీకొన్న కారు ఆ తర్వాత ప్రమాద వశాత్తు దగ్ధమైన సంఘటనలో ఆరుగురు ప్రాణాలతో బయటపడిన సంఘటన నారాయణపేట జిల్లాలో చోటు చేసుకున్నది. పోలీసుల కథనం మేరకు.. ఆర్ఎంపీ శ్రీనివాస్ తన భార్య, తల్లి, ముగ్గురు చిన్నారులతో కలిసి సొంత కారులో మంత్రాలయానికి బయలుదేరాడు. అయితే గురువారం తెల్లవారు జామున 5 గంటల సమయంలో మాగనూరు మండల కేంద్రంలోని రోడ్డు క్యాంపు సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన లారీని తప్పించబోయి ప్రమాదవశాత్తు కారు చెట్టును బలంగా ఢీకొన్నాడు. దీంతో ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన అందరూ బయటకు వచ్చేందుకు కారు డోర్లు తెరవగా.. ఇన్ టైంలో ఓపెన్ కావడంతో వాహనంలోంచి బయటపడ్డారు. పెద్ద ప్రమాదం తప్పడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. సంఘటనను చూసిన కొందరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. కానీ అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు మాగనూర్ ఎస్సై అశోక్‌బాబు తెలిపారు.

మంటలంటుకొని దగ్ధమవుతున్న కారు